


# బొమ్మ

ద్విభాష్యం రాజేశ్వరరావు

మాలతికి మతిపోయినంత పనయింది.

కొంత సేపు దాదాపు ఊపిరి స్థంభించి నట్లనిపించింది!

అది పీడకల కాదు! వాస్తవం.

ఆ బొమ్మను ఎంతో జాగ్రత్తగా. తీసింది. టవల్‌తో తుడిచేటపుడు ఎక్కడ జారిపడిపోతుందోనని బల్లమీద ఆన్చి మరీ శుభ్రం చేసింది. అతి జాగ్రత్తగా యధాస్థానంలో వుంచబోయింది!

అంతే!!

టేబిలు మూలకు చేయిరాసుకుని లటుక్కున క్రింద పడిపోయింది!

బొమ్మ ముక్కలయిపోయింది!

నీరసంగా కుర్చీలో కూలబడి పోయింది మాలతి. కళ్ళలో నీళ్ళు తిరిగేయి. నేలమీద ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ముక్కలు తనవంక చూసి వికృతంగా నవ్వుతున్నాయి.

ఒకటీ.... రెండూ.... కాదు! సుమారు పది పన్నెండు ముక్కలయిపోయింది ఆ బొమ్మ!

రెండు నిముషాల క్రితం వరకూ టేబిలు మీద అందంగా వున్న కృష్ణుని సుందర విగ్రహం ఈ క్షణంలో నేల మీద చెదురుమదురుగా ముక్కలై పడివుంది.

అయిదు నిమిషాలు చేష్టలుడిగి కుర్చీలో వుండిపోయింది మాలతి. తరువాత మెల్లగా లేచి నేలమీది ముక్కలన్నీ ఎత్తి టేబిలుమీద పోసింది. వాటిని దగ్గరగాచేర్చి ఆకారం తీసుకురావటాని కెన్నో విధాల యత్నంచేసింది!

సాధ్యం కాలేదు!

అది సాధ్యమయ్యే పని కాదని మాలతికి తెలుసు!

ఒకటి రెండు చోట్ల పగిల్తే దేనితో నయినా అతకవచ్చు! కానీ ముక్క ముక్కలుయిపోతే, ఏ భాగం ఎక్కడి నుండి ఊడిపోయిందో తెలుసుకోవటం కుడా సాధ్యం కాలేదు. ఎంత ఆపుకున్నా సాధ్యపడకుండా కన్నీళ్ళు ఉరికి వచ్చేయి. నీళ్ళు నిండిన కళ్ళతో గడియారం వంక చూసింది.

మూడుంపావు అయింది!

అంటే, సుమారు ఇంకో గంట న్నరలో భర్త వస్తాడు.

ఆయనకు ఏమని చెప్పటం!!

బొమ్మ ఎలా పగిలిందని అడిగితే ఏం సమధానం చెప్పాలి?

తన సమధానం అతడు నమ్ముతాడా? ఉహు! లాభంలేదు! నమ్మడు.

అసలు తన సమాధానం కోసం కూడా ఆగకుండా ముక్కలయిపోయిన బొమ్మను చూసి తనపై విరుచుకుపడటం ఖాయం.

మాలతి నిలువెల్లా వణికిపోయింది.

భర్త శ్రీధర్‌కు ఆ బొమ్మంటే ప్రాణం! తనను కాపురానికి తీసుకు వచ్చిన మొదటిరోజున అంటే సుమారు పదిరోజుల క్రితం ఆ విషయం చెప్పేడు!

"చూడు మాలతీ! నేనూ అరుణా కేవలం పదహారు నెలలు మాత్రమే కలిసివున్నాం. మా అన్యోన్య దాంపత్యం చూడలేక అరుణను తనవద్దకు తీసుకున్నాడు దేవుడు. ఆ కొద్ది నెలల్లోనే వందసంవత్సరాల ప్రేమనూ, అనురాగాన్నీ నాకు ఇచ్చింది అరుణ. అయితే, అదంతా నా జీవితంలో ఒక కలలా గడిచిపోయింది. నువ్వు ఈ నాడు నా జీవితంలోకి అడుగుపెట్టావు. నిన్ను పూర్తి మనసుతో ప్రేమిస్తాను. పాత జ్ఞాపకాలను దూరం చేసుకోటానికి మాత్రం నాకు కొంత సమయం కావాలి. దయచేసి నన్ను వేరే ధోరణిలో అర్థం చేసుకోకు!"


కొంతసేపు ఆగి ఆ తరువాత మళ్ళీ అన్నాడు:

"ఒకప్పుడు ఈ ఇంట్లో ప్రతి వస్తువూ అరుణ రూపాన్నీ, ఉనికినీ గుర్తుకు తెచ్చేవి. కాని నిన్ను వివాహం చేసుకునే ముందు అన్నిటినీ తోసేశాను. కనీసం అరుణ ఫోటోకూడా లేకుండా చేశాను. అదంతా, నిన్ను నిండు మనసుతో నా జీవితంలోకి ఆహ్వానించటానికి మాత్రమే! నేను నిన్ను నిరాదరిస్తున్నానని అనుకోకుండా వుండటానికే! అయితే, ఈ ఒక్క బొమ్మ మాత్రం నాకు ప్రాణంతో సమానం.

"అరుణ గొప్ప కళాకారిణి! ప్లాస్టర్ ఆఫ్ పారిస్‌తో గొప్పగా బొమ్మలు చేసేది. ఈ కృష్ణుని విగ్రహం ఆమె ఎంతో శ్రమించి తయారుచేసి మా పెళ్ళిరోజున నాకు కానుకగా ఇచ్చింది. ఈ ఒక్క బొమ్మను మాత్రమే అరుణ గుర్తుగా దాచుకున్నాను. దీన్ని జాగ్రత్తగా వుంచు."

శ్రీధర్ ఆ రోజున చెప్పిన మాటలు పదేపదే మనసులో కదలాడేయి. ఆ దినం భర్త ఆ మాటలు చెప్తుంటే తన కళ్ళు చెమర్చేయి. అరుణను మరిచిపోయి తనపైన ప్రేమను పెంచుకునేందుకు అతడు చేసే ప్రయత్నం ప్రతి మాటలోను వినిపించి. ఆ దినం నుండీ ఈ దినంవరకూ ప్రతి కదలికలోనూ కనుపిస్తోంది. భర్త సంస్కారానికీ మంచితనానికీ జోహారనలేకుండా వుండలేకపోతుంది! రెండో పెళ్ళి చేసుకునే మనిషనే భయంతో తాను వివాహ జీవితంలోకి ప్రవేశించింది. అయితే, ఆ భయం మొదటి దినాన్నే పోయింది. లోటులేకుండా తనను చూస్తున్నాడు శ్రీధర్!

తనను ప్రాణంతో సమానంగా చూసుకుంటున్నాడు!




తాను ఆనాడే అతడికి మాట ఇచ్చింది. "మీకు విలువయిన వస్తువు నాకూ ప్రాణప్రదమే! స్వర్గానికి వెళ్ళిపోయిన అక్కయ్య నాకు రెండు కానుకలు మిగిల్చింది.

"ఒకటి మీరు! రెండోది ఈ బొమ్మ" అంటూ శ్రీధర్ గుండెలమీద ఒదిగిపోయింది.

ఆ బొమ్మకూ తన భర్తకూ అంతటి అనుబంధం వుంది. కాదు వుండేది!

పది నిమషాల క్రితం అది ముక్కలయిపోయింది!

ఈ తప్పుకు భర్త తనను క్షమించడు.

ఈవేళ్టివరకూ భర్తలోని అనురాగాన్నే చూసింది కాని కోపాన్ని చూడలేదు!

ఈ పరిస్థితిని ఎలా ఎదుర్కోటం? ఏదో గట్టి కారణం ఆలోచించి చెప్పాలి!

అబద్ధం ఆడాలి! తప్పదు!

ఏమని చెప్పటం?....

ఈ ముక్కలన్నిటినీ దూరంగా విసిరేసి బొమ్మను ఎవరో తీసుకుపోయారని చెప్తే?....

వీధి వరండాకు ఆనుకునే బెడ్‌రూము వుంది. తాను పెరట్లో బట్టలు ఆరేస్తున్న సమయంలో తలుపు వేయటం మరిచిపోతే, ఎవరయినా లోనికి వచ్చి సులువుగా బొమ్మను తీసుకుపోవచ్చును. కానీ, తన బంగారపు గొలుసు, వాచీ, ఇంకా చిన్న చిన్న విలువయిన వస్తువులు అన్నీ ఆ టేబిలుమీదే వుంటాయి. వాటన్నిటినీ వదిలి ఈ బొమ్మ దొంగిలించుకుపోయారని చెప్తే భర్త నమ్ముతాడా?

ఊహు! లాభంలేదు! నమ్మడు!

భర్తే కాదు! ఎవ్వరూ నమ్మరు! సరికదా, నవ్వుతారు!

భర్తకు ఆ బొమ్మ ప్రాణప్రదం కాని, మిగిలిన వాళ్ళకు కాదు కదా!

కొంతసేపు ఏమీ పాలుపోలేదు మాలతికి!

పోనీ, తుడుస్తూవుంటే చేజారి పడిపోయిందని నిజం చెప్పేస్తే? భర్త నమ్మకపోవచ్చు!


అరుణపైన అకారణంగా ద్వేషం పెంచుకుని కేవలం మాత్సర్యంతోనే ఈ పని చేసినట్లు అనుకుంటాడు. తనకు మిగిలిన ఒక్క జ్ఞాపకాన్నీ దూరంచేయటానికి ప్రయత్నించినట్లు అనుమానిస్తాడు.

అంతలోనే టామీ తోకాడించుకుంటూ వచ్చి కాళ్ళదగ్గర నిలబడింది. తాను

ఎంతకూ నిద్రా పిలవకపోవటం గమనించి చెంగున టేబిలుమీదకు దూకి కూర్చుంది. తరువాత మాలతి మోచేతిని నాకటం ప్రారంభించింది.

మెరుపులా ఒక ఆలోచన వచ్చింది మాలతికి!

'టామీ' టేబిలు మీదకు దూకి బొమ్మను తోసేసిందని చెపితే సరిపోతుంది!



దానికి తిరుగుండదు!

అయితే, ఒక్క క్షణంలోనే ఆ ఆలోచన కూడా తేలిపోయింది.

టేబిలు గోడకు ఆనిచ్చివుంది, గోడకు దగ్గరగా టేబిలుకు మధ్యగా వుంటుంది ఆ బొమ్మ. కుక్క తోసేసినా టేబిలుమీదే పడాలి తప్ప నేలమీద పడి ముక్కలయిపోయే సావకాశం లేదు!

పనిమనిషి గది ఊడుస్తూవుండగా కింద పడిపోయిందని చెప్తేనో?!

పనిమనిషిని బ్రతిమాలుకోవచ్చు! దాని చేతిలో ఒక రూపాయి పెడితే తనే పగలగొట్టినట్లు ఒప్పుకుంటుంది! కాని ఆ విషయం కూడా భర్త నమ్మడు! ఎందుకంటే, తాను కాపురానికి వచ్చిన మొదటి రోజునే పనిమనిషి తన బెడ్ రూమ్ తుడుస్తూ వుండే వద్దని తనే వారించింది. "ఈ గది మనిద్దరికే పరిమితం. ఇందులోకి వేరెవ్వరూ రావటానికి వీలులేదు. ఈ గది నేనే

శుభ్రం చేసుకుంటాను," అంది భర్త తోను.

"అలాగే మాలతీ! నీ ఆనందానికి అడ్డువచ్చే విధంగా ఏమీ చెప్పను! నీ ఇష్టం!" అన్నాడు.

ఇది జరిగేక ఈ మధ్యరోజుల్లో ఏనాడూ పనిమనిషి తమ గదిలోకి రాలేదు. మరి, ఈ వేళ ఎందుకు వెళ్ళిందని అడిగితే ఏం చెప్పటం?

ఉహూ! లాభంలేదు!

భర్త ఆఫీసునుండి వచ్చేక అతి భయంకరమయిన పరిస్థితి ఎదురవుతుంది. దాన్ని తట్టుకునేటందుకు తాను సిద్ధపడాలి! కానీ, ఎలా?

గుండెలు గుబగుబలాడుతున్నాయి.

టేబిలుమీది న్యూస్‌పేపరు చేతిలోకి తీసుకుని చదవటానికి యత్నించింది. ఉహూ! మనసు నిలవటంలేదు!


వంటింట్లోకి వెళ్ళి కాఫీ కలిపి ఫ్లాస్కులో పోద్దామనుకుంది. కానీ, కుర్చీలోంచి లేవలేకపోయింది.

కాళ్ళు నేలకు అంటుకున్నట్లు వుండిపోయేయి.

గడియారం వంక చూసింది.

నాలుగున్నర కావొస్తోంది.

శ్రీధర్ ఆఫీసు నుండి తిరిగివచ్చే సమయం దగ్గరపడింది. ఏ నిమిషాన్నయినా అతడు వస్తాడు.




టేబిలుమీది ముక్కలు చూస్తాడు. ఏమయిందని అడిగితే ఏమని చెప్పటం?

వణికే చేతుల్తో ఆ ముక్కల్ని తడిమింది.

అంతలోనే గేటు తెరిచిన చప్పుడు అయింది.

బెదురుగా వీధివంక చూసింది!

శ్రీధర్ చిరునవ్వుతో లోనికి వచ్చేడు!

"హాయ్, మాలతీ! అలావున్నావే?" అంటూ దగ్గరకు వచ్చేడు. టేబిలుమీది ప్లాస్టర్ ఆఫ్ పారిస్ ముక్కల్ని చూస్తూ క్షణంసేపు నిలబడిపోయేడు.

"ఏమండీ! క్షమించండి! పొరపాటున చేయిజారి బొమ్మ బద్దలయిపోయింది!" అంటూ మాలతి శ్రీధర్ గుండెలమీద వాలి ఏడ్వటం మొదలుపెట్టింది.

ఆమె కన్నీరు అతని గుండెల్ని తడిపేసింది.

అదురుతున్న ఆమె పెదాలు వేడిగా అతని వక్షంమీద కదులుతున్నాయి.

భయంగా కొట్టుకుంటున్న ఆమె గుండె చప్పుడు అతనికి స్పష్టంగా వినిపిస్తోంది.

రెండు నిమిషాలు గడిచిపోయాయి!

అతని రెండు చేతులూ ఆమె భుజాల పైన అనునయంగా కదిలేయి!!

